

బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు పార్కులోని వినాయక మండపం వద్ద పూజాకార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ ఆవరణలో వినాయకుడికి పూజలు చేసిన ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జగదీశ్‌బాబు, పీడీ కృష్ణ, బాబురావు, రాజేష్ తదితరులు



జవహర్‌నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్ట నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత నరేష్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



బర్కత్‌పురలోని శివశంకర్ వినాయక మండపం వద్ద జరిగిన పూజాకార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు తదితరులు



అంబర్‌పేట నరేంద్రనగర్ సిద్ధివినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణనాథుడికి పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యారెడ్డిని సన్మానిస్తున్న మండప నిర్వాహకులు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..



ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయంలో స్వామివారికి బిల్వార్చన

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లోని మండపాల్లోని వినాయక విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఆరోరోజైన సోమవారం కూడా లంబోదరుడి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణేష్ విగ్రహానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. కవాడిగూడ, చిక్కడపల్లి, ముషీరాబాద్, గోల్నాక, బర్కత్‌పుర, రాంనగర్, నల్లకుంట, అంబర్‌పేట ప్రాంతాల్లో వినాయక విగ్రహాలకు భక్తులు, మండప నిర్వాహకులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. చాలా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట నియోజకవర్గాల జోన్‌బృందం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)



ఎంసీహెచ్‌కాలనీలోని గణనాథునికి పూజలుచేసిన బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు తదితరులు



ముషీరాబాద్‌లో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ తదితరులు



శక్తియూత్ అసోసియేషన్ ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడి పూజల్లో పాల్గొన్న ముస్లిం, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు మహ్మద్



కవాడిగూడ తాళ్లబస్తీలో గోల్డెన్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నాయకులు మహ్మద్ అయూబ్, ముస్లింలు



పూల్‌బాగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేషుడి వద్ద అన్నదానం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు, వివిధ పార్టీల నేతలు



న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలోని గణనాథుడి వద్ద పూజలు చేస్తున్న న్యాయవాదుల జేఏసీ కో కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు



బాపూజీనగర్‌లో టీమ్ మహాబల అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణనాథుని కల్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ సుప్రియ, నాయకులు



భోలక్‌పూర్ పద్మశాలి కాలనీలోని భారీ గణనాథుడికి పూజలు చేసిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు



గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వెళ్తున్న అన్నాచెల్లెలు



బాగ్‌అంబర్‌పేటలో గణపతిపూజా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్లు బి.వెంకటరెడ్డి, పులి జగన్ తదితరులు



బాకారంలో ఏర్పాటుచేసిన గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు



తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో వైభవాని గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని గణనాథుడికి పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు



నారాయణగూడలోని జాహ్నవి మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో విద్యా సంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్, వైస్‌చైర్మన్ లక్ష్మి, ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది

జలమండలి రిజర్వాయర్ ప్రాంగణంలో పాము

ముషీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ ప్రాంగణంలో సోమవారం పాము కలకలం రేపింది. జలమండలి సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రిజర్వాయర్ ప్రాంగణం చెట్లు, గడ్డితో నిండిపోయింది. దీంతో జలమండలి సిబ్బంది ఏపుగా పెరిగిన గడ్డిని తొలగిస్తుండగా ఆరు అడుగుల విషసర్పం కనిపించడంతో వారు పరుగులు తీసారు. ఈ విషయాన్ని జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ సురేష్ స్నేక్ క్యాచర్‌లను రప్పించారు. వారు రిజర్వాయర్‌కు చేరుకుని పామును పట్టుకున్నారు. దీనితో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

దేవాలయం షెడ్డుకు తగలకుండా హెచ్‌టీ కేబుల్

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న నూతన షెడ్డుకు తగలకుండా హెచ్‌టీ విద్యుత్ కేబుల్ వైర్‌ను విద్యుత్‌శాఖ సిబ్బంది క్రమబద్ధీకరించారు. నూతన షెడ్డును 20ఫీట్ల ఎత్తులో ఏర్పాటు చేస్తున్న క్రమంలో టెంపుల్ కమిటీ సభ్యులు చేసిన విజ్ఞప్తి మేరకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ స్పందించి, అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులు టెంపుల్ వద్దకు చేరుకుని హెచ్‌టీ కేబుల్ వైర్‌ను క్రమబద్ధీకరించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, షెడ్‌కు ఏమాత్రం తగలకుండా ఏర్పాటు చేశారు. ఈ పనులను కార్పొరేటర్ సూచన మేరకు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పరిశీలించారు.

ఆర్టిజన్స్ కన్వర్షన్‌కు సర్వీస్ రూల్స్ అమలుచేయాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంస్థలు టీజీఎస్- జేఏసీ మధ్య 20 వేల మంది ఆర్టిజన్స్ కన్వర్షన్‌కు ప్రస్తుతమున్న సర్వీస్ రూల్స్ అమలుచేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జేఏసీ నేతలు, కార్మికులు డిమాండ్ చేశారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మికకమిషనరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో జేఏసీ చైర్మన్ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ గత జూలై 24న రాతపూర్వకంగా లేఖ ఇచ్చినా కూడా కన్సిలేషన్‌మీటింగ్ వాయిదా వేశామని కార్మికశాఖ అధికారులు వాట్సాప్ మెసేజ్ పంపడం సరైంది కాదన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భాల్లో ఎన్నో జాయింట్ సమావేశాలు, కన్సిలేషన్ సమావేశాలు, కోర్టు తీర్పులు వచ్చిన చరిత్ర ఉందన్నారు. కార్మికశాఖ అధికారులు కార్మికుల పక్షానకాకుండా న్యాయం వైపు కాకుండా యాజమాన్యం చెప్పినట్లు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో కన్సిలేషన్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ధర్నాలో రాష్ట్ర కన్వీనర్ వజీర్, నాగరాజు, నరేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీసీఎల్ సునీతకు వినతిపత్రం సమర్పించారు.

శతాధిక కవులకు సత్కారం



కవులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి, లయన్ ఈఎస్.సూర్యనారాయణ తదితరులు

రాంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషన్, సర్వేజన సుఖీనో భవంతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శతాధిక కవులకు సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి హాజరై కవులకు అవార్డులను అందజేశారు. లయన్ ఈఎస్.సూర్యనారాయణ, లయన్ ఎన్.మహేష్, లయన్ సూర్యతేజ, లయన్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మండడి కృష్ణారెడ్డి వ్యవహరించారు. విశిష్ట అతిథిగా లయన్ డాక్టర్ శశికాంత్, గౌరవ అతిథిగా లయన్ చెన్నకేశవరెడ్డి, జూలూరి రఘు, బండారు ప్రకాష్, డాక్టర్ యాదయ్యగౌడ్, లయన్ బండారు సుజాతశేఖర్, పీఆర్‌కే.నాగరాజు, జి.రఘుపతి రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమనేత ప్రొ.శ్రీధరస్వామిని సన్మానిస్తున్న ప్రొ.కోదండరామ్

ఘనంగా తెలంగాణ ఉద్యమనేత జన్మదిన వేడుకలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమనాయకుడు ప్రొ.శ్రీధరస్వామి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొ.కోదండరామ్ ప్రొ.శ్రీధరస్వామిని సన్మానించారు. విద్యార్థులు, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో వైద్యులు పెద్దగా ఆశలు పెట్టకపోయినా కూడా క్లిష్టమైన ఆరోగ్య పోరాటాన్ని ఎదుర్కొన్న ఉపాధ్యాయుల గురువు, తెలంగాణ స్వరం, మా మార్గదర్శక క్రాంతి. తెలంగాణ క్రూసేడర్, ఫుల్‌టైమ్ స్కాలర్, ఓయూ ప్రముఖుడు శ్రీధరస్వామి పుట్టినరోజు ఒక దీపస్తంభంగా, తెలంగాణ గర్వానికి, భారతదేశ విద్యానైపుణ్యానికి మానవస్ఫూర్తి స్థితిస్థాపకతకు ఒక వేడుకగా నిలుస్తుందన్నారు.



విద్యార్థులతో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యాయులు

సీపీఎల్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్ ప్రారంభం

అంబర్‌పేట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించడానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్లను ప్రభుత్వం ప్రారంభించిందని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆయన ప్రీ ప్రైమరీ సెక్షన్ యూకేజీని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఇంగ్లిష మీడియంలో యూకేజీ, వారికి చదువు పట్ల శ్రద్ధను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డిప్యూటీ ఐఓఎస్ నిజాముద్దీన్, సీపీఎల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుశీలమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అధ్యాపకులు సంతోష్‌కుమార్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు పట్టుకుని ఆనందంతో నినాదాలు చేస్తున్న నాయకులు



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీసీ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం.. కాంగ్రెస్ నేతల హర్షం

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపినందుకు హర్షం ప్రకటిస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సంబరాలు నిర్వహించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచిపెట్టారు. జై కాంగ్రెస్, జై రాహుల్‌గాంధీ, జై రేవంత్‌రెడ్డి అంటూ ప్లకార్డులు పట్టుకుని సంతోషంతో నినాదాలు చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ బీసీ బిల్లుకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీడీ కృష్ణ, జీఎన్ కేశవ్, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, హరికృష్ణ, అభిషేక్ కెన్నడీ, బంటారం యాదగిరిగౌడ్, జి.జయేందర్‌బాబు, లోకేష్‌యాదవ్, సుదేష్, జగదీశ్‌బాబు, బాబురావు, హఫీజ్, బాబ్జి, బానుచందర్, నరేందర్ యాదవ్, మజర్, మేడి సురేష్, నర్సింగ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వాహనదారుడికి స్వీటు తినిపిస్తున్న కాంగ్రెస్ నేతలు

చట్టబద్ధంగా 42శాతం అమలుచేయాలి

బర్కత్‌పుర: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా కాకుండా ప్రత్యేక జీవో జారీ చేసి, చట్టబద్ధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ మోతీ మార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగ రంగాలతోపాటు స్థానిక సంస్థల్లో కూడా బీసీలకు పూర్తిస్థాయి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రాజ్యాంగంలోని 9వషెడ్యూల్డ్‌లో చేర్చాలని ఆయన కోరారు.

42శాతం విప్లవాత్మక నిర్ణయం

ముషీరాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం అని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుని సామాజిక న్యాయం చేశారన్నారు. బీసీ బిల్లును గవర్నర్, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చక్రం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అలనాటి హిందీ గీతాల ఆలాపన

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అరుదైన అలనాటి హిందీగాతాల ఆలాపనతో గాయనీగాయకులు శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. తెలుగు గీతాలను కూడా అదేస్థాయిలో పాడి ఆకట్టుకున్నారు. త్యాగరాయగానసభలో సోమవారం సంధ్యాసరాగాలు పల్లవి నిర్వహణలో చిత్ర, నిర్మల, అలీ, శ్రీనివాస్, కల్యాణి, రజి, ఆంజనేయులు, కుమార్, గంగరాజు, ఖదీర్, గంగ తదితరులు సినీగీతవిభావరిలో పాలుపంచుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పీవీపీ అంజనికుమారి మాట్లాడుతూ ప్రతి పాట భావాన్ని అందించే విధంగా గాయనీగాయకులు గానం చేశారన్నారు. ప్రముఖ గాయకుడు త్రినాథరావు, వేదపండితులు వీణాపాణిశాస్త్రి తదితరులు పాల్గొని నిర్వాహకురాలు, గాయని భాగ్యలక్ష్మిని సత్కరించారు.

దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి

కవాడిగూడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధానకార్యదర్శి రెవరండ్ డాక్టర్ పి.భాస్కర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లోని ఏసీటీసీ కళాశాలలో జరిగిన తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ భాస్కర్ మాట్లాడారు. సమాజంలోని అన్ని మతాలకు రాజ్యాంగ హక్కులు దక్కాలన్నారు. ఈ సందర్భంగా చర్చీస్ ఆఫ్ సౌత్‌ఇండియా మార్డరేటర్ రెవరండ్ డాక్టర్ కె.రుబెన్‌మార్కును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చీస్ కోశాధికారి రాబర్ట్ సూర్యప్రకాష్, దళిత క్రిస్టయన్స్ సంఘాల లీడర్ స్లీవా, ఢిల్లీప్రతినిధి డాక్టర్ ఎ.ఎబినేజర్, క్రిస్టియన్ సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీరామ్ సుస్వరాలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ సుస్వరాలు పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. త్యాగరాయ గానసభలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూర్తి శ్రీరామ్, డా.వెంకటి జోస్యుల, డా.అర్చన, చక్రవర్తి, జి.సుబ్బారావు, సోమయాజులు, నిర్మల కిషోర్, భాను కస్తూరి, మల్లాది ఉష, సులక్షణ, రాజ్యలక్ష్మి గీతాలు ఆలపించి, శ్రోతలను అలరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు గాయకుడు మూర్తి శ్రీరామ్‌ను సన్మానించారు.

కుక్కలకు టీకా.. రేబిస్ నిర్మూలనకు దోహదం

నల్లకుంట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య మార్గదర్శకాల ప్రకారం కుక్కలలో కనీసం 70 శాతం టీకా వేయడం రేబిస్ నిర్మూలనలో అత్యంత ప్రభావంతమైన పద్ధతి అని సిటిజన్స్ ఫర్ యానిమల్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రస్తుతం కుక్కలను చూసుకునే వ్యక్తులు, పెంపుడు జంతువుల యజమానులు వాటికి తమ సంస్థ నిర్వహిస్తున్న ఉచిత రేబిస్ టీకాలను వేయించుకోవాలని కోరారు. సోమవారం నల్లకుంట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సిటిజన్స్ ఫర్ యానిమల్స్ సంస్థ ప్రతినిధులు షాలినీ, లీలా శ్రీనివాస్, పృథ్వి, దిలీప్, తేజ, రాకేష్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

వేధింపులు భరించలేక నవ వధువు ఆత్మహత్య

బర్కత్‌పుర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భర్త, అత్త వేధింపులు భరించలేక ఓ నవవధువు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళహాట్‌లో నివాసముంటున్న ధనరాజ్, రేష్మ దంపతుల కుమార్తె అక్షిత(17)ను నింబోలి అడ్డకు చెందిన అర్జున్ ముంగా నాల్(26)కు ఇచ్చి గత ఏప్రిల్‌లో పెళ్లిచేశారు. పెళ్లప్పుడు బంగారం, నగదు ఇచ్చారు. ఇంకా రూ.25 వేలు ఇవ్వాల్సి ఉంది. దీంతో కొన్ని రోజులుగా అక్షితను భర్త అర్జున్, అత్త మందబాయి వేధిస్తున్నారు. దీంతో అక్షిత భర్త ఇంట్లోని బాత్‌రూంలో చున్నీతో ఉరేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలు తల్లి రేష్మ ఫిర్యాదు మేరకు సోమవారం భర్త అర్జున్, అత్త మందాబాయిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు.